Namasthe Telangana Dt 22/11/16.




# స్టేషన్ నుంచి స్కైవాక్

- 'మెట్రో రైల్' వినూత్న ఆలోచన
- రోడ్డుపైకి రాకుండా నేరుగా ప్రభుత్వ దవాఖానలు, విద్యాలయాలకు వెళ్లొచ్చు..
- పే అండ్ యూజ్ పద్ధతిలో ప్రైవేటు కార్యాలయాలకు సౌకర్యం
- ప్రయాణికుల ట్రాఫిక్ చిక్కులకు చెల్లుచీటి
- ఎల్ అండ్ టీతో చర్చలు పూర్తి

12

మెట్రో రైలు ప్రయాణికులకు మరిన్ని సౌకర్యాలు అందుబాటులోకి తెచ్చేందుకు హెచ్ఎంఆర్ సన్నాహాలు చేస్తోంది. స్టేషన్‌లో రైలు దిగిన వ్యక్తి ట్రాఫిక్ కష్టాలను ఎదుర్కొంటూ పాఠశాల, ప్రభుత్వ దవాఖాన, ఇతర కార్యాలయాలకు వెళ్లే ఇబ్బంది లేకుండా నేరుగా ఆ ప్రాంతాలకే 'స్కైవాక్' ఏర్పాటు చేయాలని యోచిస్తోంది. దీనిద్వారా ఆయా కార్యాలయాల నుంచి డైరెక్ట్‌గా మెట్రో స్టేషన్లకు చేరుకునే సౌకర్యం కూడా ఉండడంతో ప్రయాణికులకు సమయం ఆదా అవుతుంది. ప్రైవేటు సంస్థలు ముందుకు వస్తే వారి కార్యాలయాలకు కూడా పే అండ్ యూజ్ పద్ధతిలో వీటిని నిర్మించాలని ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ విషయమై ఇప్పటికే ఎల్‌అండ్‌టీతో చర్చలు జరిపిన హెచ్ఎంఆర్ ఆచరణ వైపు అడుగులేస్తోంది.

- సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ

# సాఫీగా సాగిపోవచ్చు..!

- మెట్రో ప్రయాణికులకు తీరనున్న ట్రాఫిక్ కష్టాలు
- స్టేషన్ల నుంచి కార్యాలయాల్లోకి నేరుగా స్కైవాక్‌లు
- చార్జీ చెల్లిస్తే ప్రైవేట్ కంపెనీలకు స్టేషన్ల నుంచి ఆకాశమార్గాలు



సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:హైదరాబాద్ మెట్రోరైల్ ప్రాజెక్టు..కొత్త ఆలోచనలతో ప్రయాణికులకు సరికొత్త సౌలభ్యాలను జోడిస్తోంది. మెట్రోరైలులో ప్రయాణం చేసిన ఏ వ్యక్తికి ట్రాఫిక్ అంతరాయం లేకుండా స్టేషన్ నుంచి నేరుగా గమ్యస్థానాలకు చేర్చేలా చర్యలు చేపడుతోంది. పని ముగించుకున్న తర్వాత మెట్రో రైల్వేస్టేషన్‌కు చేరడానికి ఎటువంటి అడ్డంకులు లేకుండా ఏర్పాట్లు చేస్తోంది. ఇందుకోసం స్కైవేలను ఉపయోగించుకోవాలని ఆలోచన చేస్తున్నది. మెట్రో ప్రయాణం సౌకర్యవంతంగా, ఉల్లాసంగా సాగేలా ప్రతి అంశంపై దృష్టి సారిస్తూ..నిర్మాణ పనుల్లో వేగం పెంచింది. 2017లో ఎలాగైనా అన్ని హంగులతో ప్రజల ముందుకు ప్రపంచ స్థాయిగా హైదరాబాద్ మెట్రోరైలు ప్రాజెక్టును నిలిపేందుకు సర్వశక్తులు ఒడ్డుతోంది.

**కార్యాలయాల్లోకి నేరుగా స్కైవాక్**

రైలులో ప్రయాణించిన వ్యక్తి సాధారణంగా చేరాల్సిన స్టేషన్లో దిగి ఫుట్ ఓవర్ బ్రిడ్జి(ఎఫ్ఓబీ)ల ద్వారా ట్రాక్ దాటుతాడు. స్టేషన్ల నుంచి బయటకు వచ్చి ఆ తర్వాత అడ్డంగా ఉన్న రోడ్డు దాటడానికి ట్రాఫిక్‌లో నానా తంటాలు పడి కార్యాలయాలకు చేరుకుంటారు. నగరంలో ఇలా ప్రతిరోజూ ఇంటి నుంచి కార్యాలయానికి రావాలన్నా..కార్యాలయం నుంచి ఇంటికి వెళ్లాలన్నా పెద్ద ఎక్సర్‌సైజ్ చేయాల్సి ఉంటుంది. పద్మవ్యూహం వంటి ట్రాఫిక్‌ను దాటడం అంత సులువు కాదు. అందుకే మెట్రోరైలు ప్రయాణికులకు ఇటువంటి కష్టాలు లేకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నారు. స్టేషన్లో దిగిన విద్యార్థులు నేరుగా పాఠశాలలు, కళాశాలలకు వెళ్లేందుకు స్టేషన్ల నుంచి నేరుగా స్కైవేలు విద్యా సంస్థల్లోకి ఏర్పాటు చేస్తారు. ఇదే విధంగా దవాఖానాలకు, ప్రభుత్వ కార్యాలయాలకు, ప్రముఖ కార్పొరేట్ కంపెనీలకు, వ్యాపార సముదాయాలకు నేరుగా స్టేషన్ల నుంచి స్కైవాక్‌లు ఏర్పాటు చేస్తున్నారు. పోలీస్ స్టేషన్లలోకి స్కై వేలు వేయాలని ప్రతిపాదనలు ఉన్నప్పటికీ భద్రత పరంగా ఉన్న ఇబ్బందులను పరిశీలించాకే దీనిపై నిర్ణయం తీసుకోనున్నారు. స్టేషన్లో దిగిన ప్రయాణికుడు ఎటువంటి ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా నేరుగా సదరు ప్రాంతంలోకి దిగుతారు.

**ప్రైవేటుకు పే అండ్ యూజ్ సిస్టం**

మెట్రో స్టేషన్ల నుంచి ప్రైవేటు సంస్థల కార్యాలయాల ఆవరణంలోనూ స్కైవేలు ఉండనున్నాయి. హెచ్ఎంఆర్ మూడు కారిడార్లలో ఈ విధానం అమలు చేయబోతున్నారు. స్టేషన్ల నుంచి నేరుగా కోరిన సంస్థకు ఆకాశ మార్గాలు వేస్తారు.ఇందుకు సంబంధిత సంస్థ ప్రత్యేక చార్జీలు భరించాల్సి ఉంటుంది. సాలీనా మొత్తాన్ని వసూలు చేస్తారు. అద్దెతో పాటు చార్జీలు చెల్లించేందుకు ముందుకు వచ్చిన ప్రతి సంస్థ ప్రాంగణంలోకి స్టేషన్ నుంచి స్కైవే నిర్మిస్తారు.అయితే తొలుత విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు, వైద్యశాలలకు ఉచితంగా ఏర్పాటు చేస్తారు. వీటితో పాటు స్టేషన్ నుంచి మరో స్టేషన్‌కు వెళ్లడానికి కూడా ఇరువైపులా స్కైవేలు ఉంటాయి. మెట్రో ప్రాజెక్టుకు ఇరువైపులా ఈ స్కైవేలు ఏర్పాటు కానున్నాయి.